RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | శుక్రవారం 31-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 303 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




# ప్రమాదాన్ని హత్యగా మార్చేస్తారా?

## నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- సీదిరి అప్పలరాజు కుటుంబంపై ప్రభుత్వం కుట్రలు
- రోడ్డు ప్రమాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం హేయం
- టీడీపీ నేతల ప్రమాదాల్లోనూ ఇదే విధంగా వ్యవహరించారా?
- చంద్రబాబుకు యాదవులంటే ప్రేమ లేదు.. బీసీలంటేనే చులకన
- మేం తెచ్చిన పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను అమ్మకానికి పెట్టారు
- మత్స్యకారుల జీవితాలు సర్వనాశనం చేస్తున్నారు
- హామీలు నిలుపుకోలేక ప్రశ్నించే గొంతులు నొక్కుతున్నారు



శ్రీకాకుళం : అనుకోని పరిస్థితుల్లో దురదృష్టవశాత్తు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేస్తే, దాన్ని హత్య కేసుగా మార్చడం అత్యంత హేయమని, చంద్రబాబు దిగజారిన దారుణ రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఆ కేసులో మాజీ మంత్రి అప్పలరాజును ఇరికించి జైలుకు పంపడం ఆ కుటుంబంపై చంద్రబాబు కూటమి ప్రభుత్వ కుట్రను తేటతెల్లం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు చేసిన రోడ్డు ప్రమాదాల్లో కూడా ఇలాగే వ్యవహరించారా.. అని సూటిగా ప్రశ్నించారు. అప్పలరాజు కుటుంబానికి పార్టీ పరంగా పూర్తి అండగా ఉంటామని, ఈ కేసులో న్యాయమే గెలుస్తుందని చెప్పారు.

2లో

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..



- టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు
- ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం
- ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు
- బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం
- మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా, తర్వాత ఇతర నగరాలకు విస్తరణ
- ప్రైవేట్ యాప్‌ల కన్నా తక్కువ ఛార్జీలతో సేవలు అందించేలా ప్రణాళిక


తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి

## పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు..

- పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం
- స్వాగతించిన ప్రధాని నరేంద్ర మోదీ
- పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ
- పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సంస్కరణలు చేపట్టినట్లు వెల్లడి
- విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ

పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు.

2లో



# '2034 వరకు నేనే సీఎం'..



## ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ



## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

హైదరాబాద్: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్దీ సుదర్శన్ రెడ్డి ఇక లేరు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు పెద్దీ సుదర్శన్ రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం..



- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు
- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్

## ఆరు నెలల్లోనే అసంతృప్తి.. డీఎంకేను వీడనున్న పన్నీర్ సెల్వం?

- తనకు ఎలాంటి కీలక పాత్ర లభించకపోవడంతో ఓపీఎస్ అసంతృప్తి
- కుమారుడితో కలిసి పార్టీని వీడి టీవీకేలో చేరాలని యోచిస్తున్నట్లు ప్రచారం
- తేని నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నా ప్రాధాన్యత దక్కడం లేదని అసహనం
- కొన్ని వారాల క్రితమే పార్టీ మార్పు వార్తలను తీవ్రంగా ఖండించిన పన్నీర్ సెల్వం
- డీఎంకేను మాతృ సంస్థగా అభివర్ణించినా, ఇప్పుడు ఆయన వర్గం నుంచే లీకులు

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే శాసనసభ్యుడు ఓ పన్నీర్ సెల్వం (ఓపీఎస్) పార్టీ మారతారన్న ఊహాగానాలు మరోసారి బలంగా వినిపిస్తున్నాయి. డీఎంకేలో చేరి



2లో

## బాధితుల్ని గాలికొదిలేసి.. నిందితుడి కుటుంబానికి పరామర్శనా?:

- జగన్‌పై లోకేష్ ఆగ్రహం
- హిట్ అండ్ రన్ కేసులో జగన్ తీరుపై మంత్రి లోకేష్ ఆగ్రహం
- శ్రీకాకుళం పర్యటనలో మాజీ మంత్రి అప్పలరాజు కుటుంబాన్ని కలిసిన జగన్
- ఇది పరామర్శ కాదు, నేరస్థ మనస్తత్వానికి పరాకాష్ట అని లోకేష్ ట్వీట్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో బాధితుడి



2లో

## దేశంలో అడుగు పెట్టిన వెంటనే హసీనాను అరెస్ట్ చేస్తాం..

- బంగ్లా మంత్రి హెచ్చరిక!
- డిసెంబర్‌లో స్వదేశానికి వెళతానన్న హసీనా
- కోర్టులో లొంగే అవకాశం ఉండకపోవచ్చన్న ఆ దేశ మంత్రి
- హసీనా పాస్‌పోర్టు ఇప్పటికే రద్దు
- 2025లో మరణశిక్ష విధించిన ట్రైబ్యునల్

స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం మరోసారి



## నిండు కుండలా కళకళలాడుతున్న కడెం ప్రాజెక్టు

**నిర్మల్:** కడెం ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 21,048 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం (ఫీ=ా) 700 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 691 అడుగులకు చేరుకుంది. ఇదే స్థాయిలో వరద ప్రవాహం కొనసాగితే లేదా మరింత పెరిగితే, ప్రాజెక్టు స్పిల్వే గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం వుంది.

## గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

**మహబూబాబాద్:** పట్టణం లోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం అయ్యారు. దాంతో కళాశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అందోళనలో వున్నారు.

## మృతుడు డిజిల్ దొంగ

**అనంతపురం:** గుత్తి - తాడిపత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని తెలంగాణ వాసిగా పోలీసులు గుర్తించారు. డీజిల్ దొంగల ముఠా కు చెందిన కారు వేగంగా లారీని ఢీ కొనడం తో ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగాయి. వెంటనే ఇద్దరు కారు నుంచి బయటకు దూకేసినట్లు పోలీసులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న డీజిల్ దొంగ సజీవదహనం అయ్యాడు. వీరంతా తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా మరికల్ మండలం బుడేగాన్ తాండాకు చెందిన వారిగా గుర్తింపచారు.

## ఝార్ఖండ్ బొగ్గు మాఫియాపై ఈడీ ఉక్కుపాదం

**ధన్ బాద్:** అక్రమ బొగ్గు తవ్వకాలు, మనీలాండరింగ్ ఆరోపణలపై ధన్బాద్ జిల్లాలోని 25 చోట్ల ఈడీ ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆస్తుల పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా సుమారు రూ.600 కోట్ల విలువైన ఆస్తులు, పెట్టుబడులను గుర్తించిన ఈడీ.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. దర్యాప్తులో అక్రమ బొగ్గు తవ్వకాల ద్వారా వచ్చిన నిధుల జాడను గుర్తించి, వాటి నెట్వర్క్ను ఛేదించడంపై ఈడీ దృష్టి సారించింది

## తెలంగాణలో భారీ వర్షాలు

**హైదరాబాద్:** తెలంగాణలో వర్షాలు జోరందుకున్నాయి. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రెండు రోజులుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతున్నాయి. ఆదివారం ఓ మోస్తరుగా మొదలైన చినుకులు.. గురువారం నాటికి అతిభారీ వర్షాలుగా మారాయి. ఈ సీజన్లో రెండు నెలలు వట్టిబోయిన వాగులు.. ప్రస్తుతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాష్ట్రమంతటినీ వర్షాలు పలకరించాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. సీజన్లోనే అత్యధిక వర్షపాతం మంగళవారం అర్ధరాత్రి నమోదైంది. దీంతో రాష్ట్రంలో మీడియం ప్రాజెక్టులకు వరద పోటెత్తుతున్నది. నిన్నమొన్నటిదాకా డెడ్స్టోరేజ్లో ఉన్న కడెం ప్రాజెక్టు ఇప్పుడు భారీ వరదతో నిండుకుండలా మారుతున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఇటు కృష్ణా బేసిన్లోనూ ప్రాజెక్టులకు వరద వస్తున్నది. తాజా వర్షాలతో ఇన్నాళ్లూ లోటులో ఉన్న వర్షపాతం సాధారణ స్థాయికి చేరుకుంటున్నది.భారీ వర్షాలకు బెల్లంపల్లి, రామగుండం రీజియన్లలోని ఓపెన్కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి, ఓవర్బర్డెన్(మట్టి) వెలికితీత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎడతెగని వానలతో క్వారీల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ, ఇందారం ఓసీపీలు, మందమర్రి ఏరియాలోని కల్యాణిఖని ఓసీపీ, బెల్లంపల్లి ఏరియాలోని ఖైరీగూరా ఓసీపీల్లో సుమారు 30 వేల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. దాదాపు 2 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్(మట్టి) వెలికితీతకు అంతరాయం ఏర్పడింది.

## ఉగ్రరూపం దాల్చిన మూల వాగు

**రాజన్న సిరిసిల్ల:** కోనరావుపేట మండలంలోమూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు మూల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగు నీటి ఉధృతికి మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల మధ్య ఉన్న రహదారి పూర్తిగా తెగిపోయింది. రహదారి కొట్టుకుపోవడంతో ఆయా గ్రామాల నడుమ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వాగుపై వెంటనే వంతెన నిర్మించాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కాగా, తెగిపోయిన రహదారి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకర్ను అడ్డుగా ఉంచి ప్రయాణికులను హెచ్చరిస్తున్నారు.

## మేడిగడ్డ బ్యారేజీకి పోటెత్తిన వరద

### మొత్తం 85 గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల

**హైదరాబాద్:** మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి పెరగడంతో అధికారులు 85 గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో - 1,01,530 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో - 1,01,530 క్యూసెక్కులు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో ఒకే స్థాయిలో నమోదు కావడం విశేషం.



# తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

## త్వరలో బస్సులతో పాటు ఎలక్ట్రిక్ ఆటో సేవలు!




**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) ప్రయాణికుల కోసం మరో వినూత్న సేవను అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. బస్సు ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చే దిశగా త్వరలో ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రారంభించేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఎలక్ట్రిక్ ఆటో తయారీ సంస్థలతో అధికారులు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అన్ని ప్రక్రియలు పూర్తయిన అనంతరం ఈ సేవలను అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉంది.

**ఫస్ట్ మైల్ -- లాస్ట్ మైల్ కనెక్టివిటీకి ప్రాధాన్యం**

ప్రయాణికులు ఇంటి నుంచి సమీప బస్ స్టాప్ వరకు, అలాగే గమ్యస్థానంలోని బస్ స్టాప్ నుంచి చివరి గమ్యానికి సులభంగా చేరుకునేలా 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీ' భావనతో ఈ సేవలను అందించనున్నారు. దీని వల్ల బస్సు ప్రయాణానికి ముందు, తర్వాత ఎదురయ్యే రవాణా సమస్యలు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**ఒకే బుకింగ్‌లో బస్సు, ఆటో టికెట్**

ఈ కొత్త సేవలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రయాణికులు బస్సు టికెట్‌తో పాటు ఎలక్ట్రిక్ ఆటో టికెట్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఒకే బుకింగ్ ద్వారా మొత్తం ప్రయాణాన్ని ముందుగానే ప్లాన్ చేసుకునే సౌకర్యం లభించనుంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణం మరింత సులభంగా మారనుంది.

**తొలి దశలో హైదరాబాద్‌లో ప్రారంభం**

ఈ సేవలను మొదటగా హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి ప్రయోగం విజయవంతమైతే, దశలవారీగా రాష్ట్రంలోని ఇతర నగరాలు, ప్రధాన పట్టణాలకు కూడా విస్తరించే అవకాశం ఉంది.

**పర్యావరణహిత రవాణాకు ప్రోత్సాహం**

ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టడం ద్వారా పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడంతో పాటు ప్రజా రవాణా వినియోగాన్ని మరింత పెంచడమే టీజీఎస్ఆర్టీసీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా నగరాల్లో ప్రతిరోజూ బస్సులపై ఆధారపడే వేలాది మంది ప్రయాణికులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా మారనున్నాయి. టీజీఎస్ఆర్టీసీ చేపడుతున్న ఈ కొత్త కార్యక్రమం అమల్లోకి వస్తే, ప్రజా రవాణా వ్యవస్థలో మరో కీలక ముందడుగుగా నిలిచే అవకాశం ఉందని రవాణా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఈ20 పెట్రోల్‌తో ఇంజిన్‌కు ముప్పా..? మైలేజీ తగ్గుతుందా..? కేంద్రం క్లారిటీ




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ20 పెట్రోల్ వినియోగంపై వాహనదారుల్లో నెలకొన్న సందేహాలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇథనాల్‌ను 20 శాతం వరకు కలిపిన ఈ20 పెట్రోల్ వల్ల ఇంజిన్ పనితీరు, మన్నిక లేదా మైలేజీపై గణనీయమైన ప్రభావం ఉండదని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. బీఎస్-3 పెట్రోల్ వాహనాల్లో ఈ20 ఇంధనాన్ని వినియోగించే సందర్భంలో కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లు వంటి విడిభాగాలను మార్చాల్సిన అవసరం ఉండొచ్చని ఆయన తెలిపారు. అయితే ఇంజిన్‌లో పెద్ద ఎత్తున మార్పులు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్), ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల అనంతరమే ఈ20 పెట్రోల్‌ను దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు చేసినట్లు వివరించారు.అయితే క్షేత్రస్థాయిలో వాహనదారుల ఆందోళనలు మాత్రం కొనసాగుతున్నాయి. లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వే ప్రకారం, 2023కు ముందు తయారైన పెట్రోల్ కార్ల యజమానుల్లో 66 శాతం మంది తమ వాహనాల మైలేజీ సుమారు 10 శాతం వరకు తగ్గిందని పేర్కొన్నారు. మరో 55 శాతం మంది వాహనాలకు గతంతో పోలిస్తే మరమ్మతుల అవసరం పెరిగిందని వెల్లడించారు. ఈ20 ఇంధనానికి పాత మోడల్ వాహనాలు పూర్తిస్థాయిలో అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు తమ వాహనం "జు20 జశీఎజుూఅఎశ్రీవ" కాదో ఆర్సీ బుక్ లేదా ఫ్యూయల్ ట్యాంక్ క్యాప్‌పై తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. మారుతి సుజుకి, హ్యుందాయ్, టయోటా సంస్థలు ఏప్రిల్-2023 తర్వాత తయారు చేసిన మోడళ్లను, టాటా మోటార్స్ ఫిబ్రవరి-2023 తర్వాత ఉత్పత్తి చేసిన వాహనాలను ఈ20 ఇంధనానికి అనుకూలంగా రూపొందించాయి. పాత వాహనాల యజమానులు ఫ్యూయల్ సిస్టమ్‌ను క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించుకోవడం, మైలేజీ లేదా పనితీరులో మార్పులు గమనిస్తే వెంటనే అధికారిక సర్వీస్ సెంటర్‌ను సంప్రదించడం మంచిదని ఆటోమొబైల్ నిపుణులు సూచిస్తున్నారు. ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, విదేశీ మారక వ్యయం ఆదా చేయడం, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ20 పెట్రోల్ వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే పాత వాహనాల వినియోగదారుల సందేహాలను నివృత్తి చేసే చర్యలు కూడా అవసరమని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# హద్దు మీరుతున్న మందుబాబుల వీరంగం..

### ప్రభుత్వ పాఠశాలలో ధ్వంసం

### తాళాలు పగులగొట్టి ఫ్యాన్లు, సామగ్రి ధ్వంసం..

### విద్యాశాఖ నిర్లక్ష్యంపై విమర్శలు

సి.బెళగల్: మండల పరిధిలోని కొండాపురం గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు సృష్టించిన విధ్వంసం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. గురువారం రాత్రి కొందరు మందుబాబులు పాఠశాల ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి తరగతి గదుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న సామగ్రితో పాటు సీలింగ్ ఫ్యాన్లను ధ్వంసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తరగతి గదుల పరిస్థితిని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ ఘటనతో విద్యార్థుల చదువులకు అంతరాయం ఏర్పడటంతో పాటు పాఠశాల ఆస్తులకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.స్థానికుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో కొందరు మందుబాబులు తరచూ పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులపై దాడులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-2) ఆదం భాషకు సమాచారం అందించినట్లు తెలిపారు. పాఠశాల భద్రతను బలోపేతం చేయడంతో పాటు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలకు కేవలం పది అడుగుల దూరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండటమే ఇలాంటి ఘటనలకు ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. అక్కడ మద్యం సేవించే వ్యక్తులు రాత్రివేళల్లో పాఠశాల పరిసరాల్లోనే తిరుగుతూ విద్యాసంస్థ ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల సమీపంలో బెల్ట్ షాపు కొనసాగడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. పాఠశాలలో భద్రపరిచిన విద్యార్థుల రికార్డులు, ధ్రువపత్రాలకు సంబంధించిన పత్రాలు ధ్వంసమైతే భవిష్యత్తులో విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ, పోలీసు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా స్పందించి ఘటనపై విచారణ చేపట్టి విధ్వంసానికి పాల్పడిన ఆకతాయిలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే పాఠశాల సమీపంలో కొనసాగుతున్న బెల్ట్ షాపును తొలగించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# కౌడిపల్లిలో మాల చలో నర్సాపూర్ మహాసభ విజయవంతానికి ఇంటింటి ప్రచారం

**పోస్టర్ విధానంతో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు అవగాహన**

**ఆగస్టు 1న నర్సాపూర్‌కు భారీగా తరలిరావాలని**

**మెదక్ జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ పిలుపునిచ్చారు.**

**కౌడిపల్లి, జూలై 30 :** ఆగస్టు 1న నర్సాపూర్‌లో నిర్వహించనున్న "మాల చలో నర్సాపూర్" మహాసభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కౌడిపల్లి గ్రామంలో విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ పాల్గొని గ్రామంలోని మాల సోదరుల ప్రతి ఇంటికి వెళ్లి పో స్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి ఎదురవుతున్న అన్యాయం, నష్టం గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడానికి మాల సమాజం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పోస్టర్ విధానం అమలులో చోటుచేసుకుంటున్న అంశాల వల్ల మాలలకు విద్య, ఉద్యోగాలు, సంక్షేమ అవకాశాల్లో నష్టం జరుగుతోందని ప్రజలకు వివరించారు. ఈ విషయంపై ప్రతి కుటుంబం అవగాహన పెంపొందించుకుని, తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మాల చలో నర్సాపూర్ మహాసభ నిర్వహణ లక్ష్యాలు, కార్యక్రమం ప్రాధాన్యత, సమాజ ఐక్యత అవసరం గురించి వివరించారు. మాలల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమాజ భవిష్యత్తు కోసం ఐక్యతే బలం అని, ప్రతి మాల కుటుంబం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని ఆయన సూచించారు. ఆగస్టు 1న నర్సాపూర్‌లో జరగనున్న మహాసభకు కౌడిపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాల సోదర సోదరీమణులు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

# ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**దేవరకొండలో ప్రతి వార్డు అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే**



**దేవరకొండ, జూలై 30 :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ దేవరకొండ పట్టణాన్ని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో ఖిల్లా బజార్, బొడ్రాయి బజార్, పాత పోలీస్ స్టేషన్ ప్రాంతం, మసీదు ఎదుట నిర్మిస్తున్న సీసీ రోడ్లతో పాటు ముత్యాలమ్మ బజారులో చేపడుతున్న మురుగు కాలువల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత పాటిస్తూ ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి దేవరకొండ మున్సిపాలిటీ బాధ్యతలు అప్పగిస్తే పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఇప్పుడు చేతల్లో చూపిస్తున్నామని అన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలనే అభివృద్ధి ప్రణాళికలకు ప్రాతిపదికగా తీసుకుని రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, దేవరకొండలో కూడా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మురుగు కాలువలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ--వెంకటేశ్వర్లు, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎం.ఏ. సిరాజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు వెంకటేష్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు నజీర్ అహ్మద్, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్, సంబంధిత శాఖల అధికారులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నలుగురు ముఖ్యమంత్రుల సహకారంతో రాజీవ్ పార్క్ అభివృద్ధి

**త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పునఃప్రారంభం.. టి పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**





**సంగారెడ్డి, జూలై 30:** సంగారెడ్డి పట్టణంలోని రాజీవ్ పార్క్ ఏర్పాటు నుంచి నేటి అభివృద్ధి వరకు నలుగురు ముఖ్యమంత్రుల సహకారం ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గురువారం రాజీవ్ పార్క్‌ను సందర్శించిన ఆయన, కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన నూతన వ్యాయామ పరికరాలను పరిశీలించిన జగ్గారెడ్డి, ఫౌంటెన్ పునరుద్ధరణ పనుల పురోగతిని తెలుసుకుని నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా పార్కును అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి రాజీవ్ పార్క్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారని, అనంతరం మాజీ ముఖ్యమంత్రి కె. రోశయ్య శంకుస్థాపన చేయగా, మాజీ ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి పార్కును ప్రారంభించారని గుర్తు చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాజీవ్ పార్క్ నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకుందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి సహకారంతో తొలి దశలో రూ.3 కోట్ల నిధులతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రెండో దశలో మరో రూ.6 కోట్లతో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాజీవ్ పార్క్‌ను ఘనంగా పునఃప్రారంభించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, శ్రీహరి, కౌన్సిలర్లు మహేష్, నవాజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎస్.చంద్రయ్యకు ఘనంగా వీడ్కోలు

**విద్యార్థుల భవిష్యత్తే నా జీవిత సార్థకత.. ఉపాధ్యాయుడిగా చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి**

**పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎస్.చంద్రయ్య సీఎంఓ భీమ్ గొండ**



**సంగారెడ్డి జిల్లా హత్నూర, జూలై 30:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల లో సుదీర్యకాలం ఉపాధ్యాయుడిగా ఎస్. చంద్రయ్య బాధ్యతలను నిర్వహించి నేడు పదవి విరమణ పొందుతున్న సందర్భంగా వీడ్కోలు సమావేశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా పలువురి పెద్దల సమక్షంలో విద్యార్థిని విద్యార్థుల బాధతో చిన్నబోయిన మనుషుల ఆవేదనల మధ్య వీడ్కోలు కార్యక్రమం కొనసాగడం జరిగింది, ఉపాధ్యాయుడు పాఠాలు బోధించడమే కాకుండా సమాజానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని, విధి నిర్వహణలో నిబద్ధతతో చేసిన సేవలే ఉద్యోగికి శాశ్వత గుర్తింపును తీసుకొస్తాయని సీఎంఓ భీమ్ గొండ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కాసాల గ్రామ శివారులో బీఎన్ రెడ్డి గార్డెన్స్‌లో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, హత్నూరలో స్కూల్ అసిస్టెంట్‌గా సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఎస్.సాయమొల్ల చంద్రయ్యకు గురువారం ఘనంగా అభినందన సభ నిర్వహించారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమ్ గొండ మాట్లాడుతూ.... ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది అని అన్నారు. వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. సాయమొల్ల చంద్రయ్య తన ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేసి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఎస్. సాయమొల్ల చంద్రయ్య మాట్లాడుతూ..... .ఉపాధ్యాయ వృత్తి తనకు అపారమైన సంతృప్తిని, ఆత్మతృప్తిని ఇచ్చిందన్నారు. వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేసి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు తనకు స్ఫూర్తిగా నిలిచాయని చెప్పారు. ఉపాధ్యాయుడిగానే కాకుండా సమాజ సేవలోనూ పాల్గొనడం గర్వంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తన ఉద్యోగ జీవితంలో అండగా నిలిచిన విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులందరికీ చంద్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సాయమొల్ల చంద్రయ్య విద్యార్థుల అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకట్ స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ రాజ్, రాష్ట్ర నాయకుడు దశరథ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మ్యాదరి బాల్‌రాజ్, గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి, హత్నూర సర్పంచ్ ఎల్లయ్య, కాసాల పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, చెక్క రవి, నరేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొని చంద్రయ్యను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



# దోమడుగులో రూ.60 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మహిళ సంఘ భవనం, పోచమ్మ ఆలయాలు నిర్మాణం**

**గుమ్మడిదల మున్సిపాలిటీ న్యూస్ జులై 30:** గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు గ్రామంలో హెటిరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న రూ.60 లక్షల అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మహిళా సంఘ భవనం, రెండు పోచమ్మ ఆలయాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకమని, వారికి అవసరమైన శాశ్వత వసతులు కల్పించడమే లక్ష్యంగా సంఘ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పోచమ్మ ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్యా, కౌన్సిలర్లు సోనీ, వరలక్ష్మి, విజయలక్ష్మి, మాధవి, రాజశేఖర్, రాజిరెడ్డి, మురళి, సంజీవరెడ్డి, కిషన్, చక్రపాణి, జైపాల్ రెడ్డి, రమేష్, హెటిరో పరిశ్రమ ప్రతినిధులు రామ్మోహన్ రెడ్డి, బీ.వీ. రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.




# అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విజయవంతం

**త్వరలో మెరిట్ ఆధారంగా ఎంపికలు: సీడీపీఓ హేమభార్గవి**

**నర్సాపూర్, జూలై 30:** నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ల 23 ఖాళీలకు మొత్తం 487 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 344 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అలాగే అంగన్‌వాడీ ఆయాల 56 ఖాళీలకు 260 మంది దరఖాస్తు చేసుకోగా, 188 మంది వెరిఫికేషన్‌కు హాజరైనట్లు ఆమె వివరించారు. రెండు రోజుల పాటు ప్రణాళికాబద్ధంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు సీడీపీఓ హేమభార్గవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన విద్యాశాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, త్వరలోనే మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేపట్టి తుది ఎంపిక జాబితాను విడుదల చేయనున్నట్లు సీడీపీఓ హేమభార్గవి వెల్లడించారు.



## టంగుటూరులో కరెంటు షాక్‌తో పాడి గేదె మృతి

**ఆలేరు జూలై 30:** ఆలేరు మండలంలోని టంగుటూరు గ్రామంలో గురువారం ఉదయం 5:30 గంటల సమయంలో నిడిగొండ ఆంజనేయులు ఇంటి సమీపంలోని బాయి వద్ద కరెంటు షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే టంగుటూరు గ్రామ సర్పంచ్ జుకంటి అనిల్, లైన్మెన్ తనీషా, జీపీఓ జంగిరు, గోపాలమిత్ర సుధాకర్, ఆలేరు పోలీస్ కానిస్టేబుల్ నవీన్, వడ్డేపల్లి కిషన్, అహునూరి సాయి, అహునూరి వెంకటయ్య, కందికొండ శ్రీను, పిట్టల అనిల్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంబంధిత అధికారులు ఘటనపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించడం వల్ల నేల భూసార ఆరోగ్యం మెరుగుపడుతుంది: ఎడిఎ కె.జగదీశ్వర్ రెడ్డి



**మిర్యాలగూడ,:** పచ్చిరొట్ట ఎరువులు వాడి భూసారం పెంచాలని మి ర్యాలగూడ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఎడిఎ) కె.జగదీశ్వర్ రెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాసనగర్ గ్రామ శివారులో పెసర, బొబ్బర్లు పంటలు, జీలుగ సాగు క్షేత్రాలను ఆయన గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన రానున్న ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రాంతానికి అనుకూల అరుతడి పంటల సాగు వైపు రైతులు మళ్లాలని సూచించారు. దీంతో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని సాగు వ్యయాన్ని తగ్గించడంతో రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు.జీలుగ పంటను పరిశీలించి, దీనిని పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించడం వల్ల నేల సారవంతం పెరిగి, భూసార ఆరోగ్యం మెరుగుపడుతుందని రైతులకు వివరించారు.కార్యక్రమంలో మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి ఎం.ఋష్యేంద్రమణి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, గ్రామ సర్పంచ్ అనిత మల్లేష్



**తలకొండపల్లి, జులై 30:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామానికి చెందిన బక్కి పుల్లయ్య గురువారం ఉదయం హఠాత్తుగా మృతి చెందారు. ?ఈ విషయం తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్. మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుని కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ వెంటనే స్పందించి, తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తక్షణ సహాయంగా ?3, వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. అలాగే, దేవునిపడకల్ గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ 3, వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్, వార్డు మెంబర్లు స్వామి గౌడ్, జ్యోతిలక్ష్మయ్య, గ్రామ పెద్దలు మద్దూరి సత్యం, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, బక్కి స్వామి, పులిజాల మహేష్, రాజమోని లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ కమిషన్ మెంబర్ ఆసిఫ్ అలీకి ఆత్మీయ సన్మానం




**తలకొండపల్లి.జులై 30:** తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌గా నూతనంగా నియమితులైన ఆసిఫ్ అలీ ని తెలంగాణ రాష్ట్ర టాస్క్ సి.ఓ.ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ సందర్భంగా ఆసిఫ్ అలీ ని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్చం అందజేశారు. రాష్ట్ర ఆర్థిక వనరుల సమర్థవంతమైన పంపిణీలోనూ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిలోనూ ఆసిఫ్ అలీ తనదైన ముద్ర వేయాలని రాఘవేందర్ రెడ్డి ఆకాంక్షించారు.?ఈ కార్యక్రమంలో తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ పాల్గొన్నారు.

# నగరంలో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల ప్రారంభం

### ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సేవలు అందిస్తాం..
### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
### సిటీ బస్సులో ప్రయాణించిన మంత్రి ,ఎమ్మెల్యేలు





**కరీంనగర్, 30 జులై:** కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ బస్ స్టేషన్ లో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్ సర్వీసులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం , కవ్వంపల్లి సత్యనారాయణ, నగర మేయర్ లతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి తిమ్మాపూర్ వరకు సిటీ బస్సులో ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రయాణం చేశారు. మొదటి దశలో ఈమూడు రూట్ లలోకరీంనగర్ నుంచి తిమ్మాపూర్ లో గల వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజీ వరకు, కరీంనగర్ నుంచి వేములవాడ రోడ్డులోని చింతకుంట వరకు, కరీంనగర్ నుంచి జగిత్యాల రోడ్డులోని కొత్తపల్లి హవేలీ వరకు సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులను నడుస్తాయని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కరీంనగర్ పట్టణంలో చాలా కాలంగా డిమాండ్ ఉన్న సిటీ బస్సులను ప్రారంభించుకోవడం జరిగిందని మంత్రి చెప్పారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ,మహిళలకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయి.. ప్రతిరోజు ఉపాధి కొరకు కరీంనగర్ నుండి వచ్చే చింతకుంట , ఓద్యారం, కొత్తపల్లి ,విద్యా సంస్థలకు నిలయమైన వాగేశ్వరి వైపు ఈ సిటీ బస్సు సర్వీసులు నడిపించడం జరుగుతుంది. మెడికల్ కాలేజీలు ఉండే ప్రతిమ, చల్మెడ, మానకొండూరు వైపు కూడా బస్సులు నడుపుతాం..ప్రయాణికులు ఆదరిస్తే 24 గంటలు బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అవసరమైతే ఒకే రూట్ లో అదనపు బస్సులు నడిపించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### నగర ప్రజలంతా సిటీ బస్సులను వాడుకోవాలి

సిటీ మొత్తం నలుమూలల వైపు బస్సులు నడుస్తున్నాయి.రాష్ట్రంలో కొత్త రూట్ లలో బస్సులు నడుపుతున్నాం..మహా లక్ష్మి ద్వారా మహిళలు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకుంటున్నారు..కొత్త బస్సుల కొనుగోలు ,కొత్త నియామకాలు చేపట్టాం, వారి పెండింగ్ బకాయిలు తీర్చడం జరిగింది. ప్రతి గ్రామానికి బస్ చేరాలి..ఆర్టీసీ ప్రతి రోజు 35 లక్షల కిలోమీటర్లు 65 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, సిపి గౌస్ ఆలం, సిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, మార్కెట్ కమిటి చైర్మన్ ఆకుల నర్సయ్య లు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

### చౌటుప్పల్ టి.జి.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ టి.విజిత



**యాదాద్రి భువనగిరి జిల్లా :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.విజిత గురువారం పత్రికకు ఇచ్చిన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల ఆగస్టు 3వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులను చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తు తో పాటు వారి ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు, బోనఫైడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరి జత చేయాలని తెలిపారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఆగస్టు 5వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సర్వేల్ లోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరి ఇట్టి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం

### గ్రామ సమస్యలను ఎమ్మెల్యే కసిరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి



**తలకొండపల్లి జులై 30:** గురువారం తలకొండపల్లి మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పడకల్ గ్రామ సమస్యలపై స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి పడకల్ గ్రామ సర్పంచ్ దోకురి సునీత ప్రభాకర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పలు ప్రతిపాదిత పనులు, మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యేతో ఆమె ప్రత్యేకంగా చర్చించారు. బీటీ రోడ్ల నిర్మాణం: తలకొండపల్లి నుండి రవిచెడ్ వరకు, అలాగే పెద్దూర్ తండా నుండి పడకల్ గ్రామం వరకు నూతన బీటీ రోడ్లు మంజూరు చేయాలని కోరారు. ?విద్యుత్ సమస్యల పరిష్కారం: గ్రామంలో ఉన్న ప్రమాదకరమైన ఐరన్ ఎలక్ట్రిక్ పోల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో నూతన సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తీవ్రంగా ఉన్న లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ?పశు వైద్యులు (వెటర్నరీ డాక్టర్స్): గ్రామంలోని పాడి రైతుల సంక్షేమం దృష్ట్యా పశువైద్యులను నియమించాలని విన్నవించారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు మరియు అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.గ్రామ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్లు, విద్యుత్ మరియు ఇతర అభివృద్ధి పనుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వంతో ముందుకు కదలండి

### జిఆర్ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్

మిర్యాలగూడ జూలై 30:-(ప్రపంచంలో అనేక రైతాంగ పోరాటాలకు మార్గం చూపినటువంటి మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వంతో ముందుకు సాగి కమ్యూనిస్టు ప్రజా పోరాటాలను బలపరచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికారు మల్లేష్ పిలుపునిచ్చారు. మిర్యాలగూడ మండలం తడకమళ్ళ గ్రామంలో గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సిపిఎం సీనియర్ నాయకులు గట్టికోప్పులు రాంరెడ్డి ఏడో వర్ధంతి సభలో వారు వారికి నివాళు లర్పించి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అర్థం తెలియని ఆర్ఎస్ఎస్, బిజెపి పార్టీలు ఈరోజు దానిని ఒక మతోన్మాద గొడవగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్న తరుణంలో లౌకికవాదులు ప్రజాస్వామ్యవాదులు కమ్యూనిస్టులు చేస్తున్న ప్రజా పోరాటాలకు మద్దతునిచ్చి ఆర్ఎస్ఎస్ బిజెపి చేస్తున్న మతోన్మాద కుట్రలను తిప్పి కొట్టాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో విద్యార్థుల పోరాటాలను రైతాంగ పోరాటాలను కార్మిక పోరాటాలను అపహాస్యము చేస్తూ ప్రజాస్వామ్యాన్ని



ఖూనీ చేస్తున్నటువంటి కేంద్ర పాలక ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ప్రజాస్వామ్యం రక్షించుకోవాలన్నారు. గట్టికొప్పుల రాంరెడ్డి తోపుచర్ల ఫీర్కగా పిలవబడే ఈ ప్రాంతానికి, ఈ ప్రాంతంలోనే కాకుండా మొత్తం మిర్యాలగూడ నియోజకవర్గంలో సిపిఎం నిర్మాణానికి, విస్తృత ఎదుగుదలకు తీవ్రంగా కృషి చేసి నాటి నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటంలో అనేక మందికి ఆదర్శంగా నిలిచారని సందర్భంగా సేవలను కొనియాడారు. తడకమళ్ల గ్రామానికి సర్పంచ్ గా 40 సంవత్సరాల పాటు సేవలందించి తలకమళ్ళతో పాటు చుట్టూ అనేక గ్రామాల అభివృద్ధి పనులు నడిపిన గొప్ప నాయకుడన్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం, నీటి సౌకర్యం ఈరోజు అందరికీ సమానంగా అందుతున్నాయంటే అది గట్టుకొప్పుల రామిరెడ్డి, సిపిఎం పార్టీ కృషి అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎం.రవినాయక్, సిపిఎం ఒన్ టౌన్ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాదూరు శశిధర్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరశురాములు, మాజీ సర్పంచ్లు చనగాని సైదమ్మ, వెంకటయ్య, జిఆర్ సతీమణి వరమ్మ, వినాయకరెడ్డి, తడకమల్ల శాఖ కార్యదర్శి పంగా అశోక్, జిల్లోజు శ్రీను, జిల్లోజు పుల్లయ్య, కుమ్మరి సైదులు, గోపాలదాసు సుధాకర్, గుంటి శ్రీను, మొరిశెట్టి నరసయ్య, మండల కమిటీ సభ్యులు చౌగాని వెంకన్న, ఉన్నం వెంకటేశ్వర్లు, ఆశీర్వాదం, చారి, జిఆర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక







# చినుకులు పడితే చిత్తడే

మేడ్చల్: 30 (నేటి ప్రస్థానం) మేడ్చల్ పట్టణ పరిధిలో రోడ్లు చిరుజలులకేచిత్తడిగా మారుతున్నాయి. ప్రధాన, అంతర్గత రోడ్లకు కనీస మరమ్మతులు లేకపోవడంతో బురద మయంగా మారుతున్నాయి. డ్రైనేజీ పైపులైన్లు లీకై రోడ్ల మీద మురుగు పారడంతో పాటు వర్షంనీరు తోడై రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. బస్టాండ్, జాతీయ రహదారిపై డిపో వద్ద, అంబేడ్కర్ విగ్రహం వద్ద, ప్రధాన రోడ్లలో, చంద్రనగర్, బాలాజీనగర్,ఆర్టీసీ కాలనీ, వినాయక్ నగర్ కిష్టాపూర్ రోడ్డు, హౌజింగ్ బోర్డు కాలనీ రోడ్డు, కెవిఎల్ఆర్ రోడ్డు చిత్తడిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

# ప్రైవేట్ ఆసుపత్రి ఐన అందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలి : లీలా హాస్పిటల్స్ ప్రారంభం

**మిర్యాలగూడ:** అందరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డిలు అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్ కాలనీలో లీలా హాస్పిటల్స్ యాజమాన్యం డాక్టర్ ఎల్ఎన్వి రాజేష్ రెడ్డి, బొబ్బలి వెంకట్రాంరెడ్డి, మందడి సైదిరెడ్డి, జూకూరి చైతన్య రాజు, డాక్టర్. కె.సుధాకర్, ధనావత్ రంగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లీలా హాస్పిటల్స్ ను ప్రారంభించి వారు మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలందించి ప్రజల అభిమానం పొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, జిల్లా నాయకులు గుడిపాటి నవీన్, గాయం ఉపేందర్ రెడ్డి, దుబ్బాక నర్సింహారెడ్డి, కౌన్సిలర్ ఫారూఖ్ మొహమ్మద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కోడిరెక్క ఇంద్ర కుమార్, మోయిజ్, వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి,జిల్లా నాయకులు మేద మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఇలియాస్ ఖాన్,




ఎండి యూసుఫ్, మోసిన్ అలీ, టిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షోయబ్, హాతిరామ్ నాయక్, చిట్టిబాబునాయక్, గయాస్, మాజీ సర్పంచ్ రవీందర్ పాల్గొన్నారు.

# 84 కేసుల సీరియల్ దొంగల ముఠా అరెస్ట్

**సంగారెడ్డి జిల్లా రూరల్ పోలీసులకు చిక్కిన ఇద్దరు అంతర్రాష్ట్ర చోరీగాళ్లు**





**సంగారెడ్డి జులై 30 :** జైలు నుండి బయటకు వచ్చిన వెంటనే మళ్లీ చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను సంగారెడ్డి జిల్లా రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం సాయంత్రం సంగారెడ్డి చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు.వారిని ఆపి విచారించగా అనుమానాస్పదంగా మాటలు మార్చారు.అనుమానంతో క్షుణ్ణంగా విచారించగా సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో వరుస చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారు.మునితాని అమర్ రాజ్ కుమార్ రెడ్డి వయసు 28 వృత్తి బైక్ మెకానిక్, నివాసం హైదరాబాద్ ఇతనిపై ఇప్పటికే 84 కేసులు ఉన్నాయి.అచ్చిగారి సాయికిరణ్ ఈశ్వర్ వయసు 22, వృత్తి కూలీ నివాసం ఎల్బీ నగర్, హైదరాబాద్.విచారణలో ఇద్దరూ జైలు నుండి విడుదలైన తర్వాత డబ్బు అవసరాల కోసం, విలాసాల కోసం మళ్లీ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు.సంగారెడ్డి, హైదరాబాద్ తో పాటు ఏపీలోని కర్నూల్ వరకు వెళ్లి చోరీలు చేసినట్లు వాంగ్మూలం ఇచ్చారు.మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చోరీ పాఠశాల తాళాలు పగులగొట్టి కంప్యూటర్లు, బ్యాటరీలు, మానిటర్లు ఎత్తుకెళ్లారు.తేగంపేట గ్రామంలో ఒక ఇంట్లోకి చొరబడి 3.5 తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలను దోచుకున్నారు.నిందితుల వద్ద నుండి 3 ద్విచక్ర వాహనాలు మరియు కొన్ని సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అలాగే కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్ కు తరలించినట్లు సంగారెడ్డి డీఎ.స్పీ సత్తయ్య గౌడ్ తెలిపారు. ఈ మీడియా సమావేశం లో డీఎ.స్పీ సత్తయ్య గౌడ్ తో సంగారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నయుముద్దీన్,సబ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది ఉన్నారు.



# తీజ్ పండగ సంబరాల్లో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి మండలం జిలకరకుంటతండా గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన తీజ్ పండుగ సంబరాల్లో తెలంగాణ శాసన మండలి సభ్యులు శ్రీ కేతావత్ శంకర్ నాయక్ తండా మహిళలు సంప్రదాయ బంజారా వేషధారణలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించగా ఎమ్మెల్సీ వారికి శుభాకాంక్షలు తెలిపి వారి ఆనందంలో భాగస్వామ్యమయ్యారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రామకృష్ణాపూర్,జూలై 30:** భారీ వర్షాల నేపథ్యంలో క్యాతనపల్లి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు.సెల్లార్లలో ఉన్న విద్యుత్ మీటర్లు,వైర్లను పై అంతస్తులకు మార్చుకోవాలని, నీరు చేరితే వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అవసరమైతే ఠాగూర్ స్టేడియంలోని యోగ హాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, చెట్లు,విద్యుత్ స్తంభాలు,తీగల సమీపంలో ఉండరాదని హెచ్చరించారు.మాంసం, చికెన్,చేపల దుకాణాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు.వర్షాల వల్ల సమస్యలు ఎదురైతే మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన 24 గంటల కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని,నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.



# ప్రజావాణి ఫిర్యాదుపై అధికారుల స్పందన..

**చిరుమర్తి చెక్‌డ్యాం పరిశీలన**

**మాడుగులపల్లి, జూలై 30 :** మండలంలోని చిరుమర్తి గ్రామంలో చెక్‌డ్యాం ఆక్రమణ, ధ్వంసానికి సంబంధించి ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించింది. ప్రజావాణిలో రైతు సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్, మాడుగులపల్లి తహసీల్దార్ సరోజ పావనికి లిఖితపూర్వకంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సరోజ పావని, ఇరిగేషన్ శాఖ ఏఈఈ వేణుగోపాల్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, వీఆర్వో రామారావులకు చెక్‌డ్యాం పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. అనంతరం అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విచారణలో చిరుమర్తి గ్రామానికి చెందిన కారింగు సైదులు అనే రైతు చెక్‌డ్యాంను తొలగించి ఆ స్థలాన్ని వ్యవసాయ భూమిగా మార్చుకుని సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై అధికారులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈఈ వేణుగోపాల్ మాట్లాడుతూ, చెక్‌డ్యాంను ధ్వంసం చేసినట్లు తేలితే సంబంధిత వ్యక్తులు గతంలో ఉన్న విధంగానే కట్టను పునరుద్ధరించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌డ్యాం చుట్టుపక్కల ఉన్న రైతులు మాట్లాడుతూ, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీరు నిలిచి కట్టకు నష్టం జరిగితే సమీపంలోని వ్యవసాయ భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ మోటార్ల వద్దకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అందువల్ల చెక్‌డ్యాంను పూర్వస్థితికి తీసుకువచ్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని చుట్టుపక్కల రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్గొండ :** నల్గొండ జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు ఎ.ఎస్.ఐ. ఎన్. ప్రభాకర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి. మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. హిదాయత్ అలీలకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న అధికారులకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం కేవలం వృత్తి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన గొప్ప బాధ్యత అని అన్నారు. సుదీర్ఘకాలం పాటు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన ఈ అధికారులు యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని పేర్కొన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తూ సమాజానికి తమ అనుభవాలను పంచుకోవాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖతో వారి అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, శాఖ తరఫున వారికి అవసరమైన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.పదవీ విరమణ పొందిన అధికారులు తమ సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర పోలీసు సిబ్బంది మరియు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలోఅడిషనల్ ఎస్పీ రమేష్, ఏ. ఓ శివ ప్రసాద్, ఆర్.ఐ సంతోష్,ఆర్.ఎస్.ఐ జంగయ్య, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు,సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# దెబ్బతిన్న సర్వీస్ రోడ్డును పరిశీలించిన మంత్రి వివేక్

**రామకృష్ణాపూర్,జూలై 30:** భారీ వర్షాలతో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దుబ్బపల్లి--జీఆర్ఎం టౌన్‌షిప్‌ను కలిపే సర్వీస్ రోడ్డు దెబ్బతినడంతో గురువారం తెలంగాణ రాష్ట్ర కార్మిక,గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా దెబ్బతిన్న రోడ్డును వెంటనే పునరుద్ధరించడంతో పాటు బాక్స్ కల్వర్ట్ నిర్మాణం,వీధి దీపాల ఏర్పాటు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని,అవసరమైతే కేంద్ర రహదారుల శాఖ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పల్లె రాజు, వార్డు కౌన్సిలర్ గుర్రం శ్రీనివాస్, కౌన్సిలర్లు భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.



# కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,700 కోట్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**తలకొండపల్లి జులై 30 :** కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిధుల కొరత లేదని, అన్ని గ్రామాలను విడతల వారీగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. తలకొండపల్లి మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ?రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారావమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు కల్వకుర్తి నియోజకవర్గానికి రూ.1,700 కోట్లకు పైగా అభివృద్ధి నిధులను తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మౌలిక వసతుల కల్పన: ఈ నిధులతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ?ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి అర్హుడికీ అందేలా అధికారులు నిరంతరం పర్యటించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రజలు కూడా ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ సమీక్ష సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త

# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం !

కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్ధపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్‌స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# శిక్ష భయంతో మంచివాడిగా నటించడం నిజమైన ధర్మమేనా?

**మనిషి మంచిగా ఉండటం వెనుక ఏముంటుంది? నిజంగా తన మనసు అలా చెప్పిందా, లేక శిక్ష పడుతుందని భయపడ్డాడా? ఈ రెండింటి మధ్య తేడా చాలా చిన్నగా కనిపించవచ్చు, కానీ దాని లోతు మాత్రం ఎంతో విశాలంగా ఉంటుంది. ఇది కేవలం ఒక తాత్విక ప్రశ్న మాత్రమే కాదు ఇది ప్రతి మనిషి తన నిత్య జీవితంలో ప్రతిరోజూ ఎదుర్కొనే నిజమైన వాస్తవం.పోలీసులు రోడ్డుపై ఉంటే మనం ఎంతో జాగ్రత్తగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తాం.**



ఆఫీసులో బాస్ నిరంతరం చూస్తున్నాడని తెలిస్తే ఎంతో సరిగ్గా, వేగంగా పని చేస్తాం. ఇంట్లో పెద్దలు ఉన్నప్పుడు ఎంతో గౌరవంగా మాట్లాడుతాం. ఇవన్నీ బయటకు నైతికత చర్యలే అనిపిస్తాయి, కానీ ఇవి నిజంగా మన అంతరంగం నుండి వచ్చిన స్వచ్ఛమైన నిర్ణయాలా? లేదా ఒక బయటి శక్తి అంటే శిక్ష, ఆర్థిక నష్టం, సమాజం నుండి వచ్చే తిరస్కారం వాటి భయం వల్ల అలవడుతున్న తాత్కాలిక ప్రవర్తనా?నైతికత గురించి ప్రపంచ వ్యాప్తంగా అతి ముఖ్యమైన వివేచన చేసిన గొప్ప తత్వవేత్తల్లో ఒకరైన ఇమ్మాన్యుయెల్ కాంట్ ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చాడు. మంచి చేయడం వల్ల ఏదైనా వ్యక్తిగత ప్రయోజనం కలుగుతుందని, లేదా మంచి చేయకపోతే సమాజంలో నష్టమో, చట్టపరమైన శిక్షో వస్తుందని భావిస్తూ చేసే ఏ పనీ నిజమైన నైతిక చర్య కానే కాదు. నైతికత అంటే ఎలాంటి ఫలితం ఆశించకుండా, ఎలాంటి శిక్ష భయం లేకుండా ఇది సరైనది కాబట్టి చేయడం.భారతీయ సనాతన తత్వశాస్త్రం కూడా సరిగ్గా ఇదే అద్భుతమైన మాట చెప్పింది. భగవద్గీత మనకు నిష్కామ కర్మ గురించి ఎంతో గొప్పగా బోధిస్తుంది ఫలాపేక్ష లేకుండా, ప్రతిఫలం ఆశించకుండా కేవలం కర్తవ్యం నిర్వహించడం. భయంతో చేసే పని కేవలం ఒక యాంత్రిక కర్మ అవుతుంది, కానీ అది ఎప్పటికీ పవిత్రమైన కర్తవ్యం కాలేదు. ఆది శంకరాచార్యుల వేదాంతంలో కూడా ఒక మంచి పనిని ఎందుకు చేయాలో హృదయపూర్వకంగా అర్థమైనప్పుడే అది నిజమైన ధర్మంగా పరిగణించబడుతుంది.ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న వస్తుంది: భయంతో చేసే మంచి పనులు సమాజానికి ఉపకారం చేస్తాయా? తప్పకుండా చేస్తాయి. ఒక దొంగ పోలీసు కంటికి చిక్కుతాడని భయపడి చోరీ చేయకపోతే, అక్కడ బాధితుడికి ప్రత్యక్షంగా పెద్ద ఉపకారమే కలుగుతుంది. ఈ కోణంలో చూస్తే ఫలితం సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ దీనిని దీర్ఘకాలంలో చూస్తే ఎలా ఉంటుంది?శిక్ష తప్పిపోయే అవకాశం వచ్చిన వెంటనే మనిషి మనస్సులో ఆ భయం కరిగిపోతుంది. పోలీసు లేనిచోట ట్రాఫిక్ సిగ్నల్ దాటేవారు, కెమెరాలు లేవని తెలిసినప్పుడు, ఎవరూ చూడట్లేదని అనిపించినప్పుడు అవినీతికి పాల్పడేవారు ఇవన్నీ భయం వల్ల సమాజంలో వచ్చే తాత్కాలిక నైతికత యొక్క పెద్ద పరిమితులు.

ఇప్పుడు మన తెలుగు సమాజంలో జరుగుతున్న విషయాలను ఒక్కసారి పరిశీలిద్దాం. మన ఇంట్లో పిల్లలకు మనం చిన్నప్పటి నుండి ఏం నేర్పిస్తున్నాం? నువ్వు ఇప్పుడు అబద్ధం చెప్పావంటే నిన్ను గట్టిగా కొడతా అనా? లేదా అబద్ధం చెప్పడం ఎందుకు మంచిది కాదో ప్రేమగా వివరిస్తున్నామా?మొదటి పద్ధతి పిల్లవానికి కేవలం భయం మాత్రమే నేర్పుతుంది నేను తప్పు చేస్తూ పట్టుబడకూడదు అని వాడు ఆలోచిస్తాడు. రెండవ పద్ధతి వానికి నైతికత యొక్క అసలు అర్థం నేర్పుతుంది ఇది ఎందుకు తప్పో వాడు తెలుసుకుంటాడు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడానే ఆ పిల్లవాడు పెద్దయ్యాక సమాజంలో ఎలాంటి మనిషిగా తయారవుతాడో పూర్తిగా నిర్ణయిస్తుంది.అమెరికన్ ప్రసిద్ధ మనస్తత్వవేత్త లారెన్స్ కోల్‌బర్గ్ మానవ నైతిక అభివృద్ధిని ఆరు ముఖ్యమైన దశలుగా విభజించాడు. మొదటి దశ శిక్ష తప్పించుకోవడానికి మాత్రమే నేను మంచిగా ఉంటాను.ఆఖరి దశ సార్వత్రిక నైతిక సూత్రాల ఆధారంగా నా అంతరాత్మతో జీవిస్తాను. మొదటి దశలో ఉన్న వ్యక్తి మానసికంగా పసిపాపకు సమానం,ఆఖరి దశకు చేరిన వ్యక్తి సమాజంలో నిజమైన ఉత్తమ మేధావి. అయితే మన విద్యా వ్యవస్థలో, సమాజంలో ఎంత మంది నిజంగా ఆ ఆఖరి దశకు చేరుకుంటున్నారు అనేది ఒక పెద్ద ప్రశ్న.ప్రస్తుత సమాజంలో ఒక విచిత్రమైన వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. అవినీతి చేసినవాడు దురదృష్టవశాత్తూ చట్టానికి చిక్కితే వాడు నేరస్థుడు అవుతాడు. ఒకవేళ వాడు లంచం తీసుకుంటూ ఎవరికీ చిక్కకపోతే వాడు సమాజంలో ఎంతో తెలివైనవాడు అనిపించుకుంటాడు. ఇది మన సమాజం నైతికతను చూసే ఒక వికృతమైన దృష్టి. ఇక్కడ పకడ్బందీగా తప్పు చేస్తూ దొరకకపోవడమే నిజమైన నైతికత అనే అపోహ బలంగా నాటుకుపోయింది. ఈ అపోహను పూర్తిగా పోగొట్టాలంటే మనం నిజంగా ఎందుకు మంచిగా ఉండాలి? అనే ప్రశ్నకు ప్రతి ఒక్కరూ సమాధానం వెతుక్కోవాలి.నిజమైన నైతికత ఎప్పుడూ అంతరంగం నుండి మాత్రమే వస్తుంది. అది అహంభావం నుండి కాదు, అహంకారం నుండి అసలే కాదు కేవలం స్వచ్ఛమైన మానవ సహానుభూతి నుండి వస్తుంది. నాకు ఎవరైనా అన్యాయం చేస్తే నొప్పి వేస్తుంది అని తెలుసు కాబట్టి, నేను కూడా ఇతరులకు అలాంటి నొప్పి కలిగించకూడదని మనస్ఫూర్తిగా అర్థమవుతుంది. ఇది ఏ చట్టం బలవంతంగా నేర్పినది కాదు, జీవితం మనకు నేర్పిన గొప్ప పాఠం. ఈ స్థాయి అంతర్గత నైతికతే సమాజంలో శాశ్వతమైనది, స్థిరమైనది.మహాత్మా గాంధీజీని చూడండి. ఆయన ఎప్పుడూ మంచిగా ఉండటానికి బ్రిటిష్ పోలీసు లేదా జైలు శిక్ష భయం కారణం కాదు నిజానికి ఆయన దేశం కోసం స్వచ్ఛందంగా ఎన్నో సార్లు జైలుకు వెళ్ళాడు! ఆయన నైతికత అంతరంగం నుండి వచ్చింది. బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితాంతం సమాజంలోని అన్యాయాన్ని నిరంతరం ప్రశ్నించాడు అది ఏ శిక్ష భయంతో కాదు, మానవత్వం మరియు న్యాయం పట్ల ఉన్న నిజమైన ప్రేమతో. వారు చరిత్రలో మహానుభావులుగా నిలిచిపోవడానికి కారణం వారి నైతికత అంతరంగం నుండి ఉద్భవించింది.మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే కేవలం భయంతో వచ్చే నైతికత మనిషి మనస్సులో నిరంతర మానసిక ఒత్తిడిని, ఆందోళనను సృష్టిస్తుంది. నన్ను ఎవరైనా చూస్తున్నారా? నేను పట్టుబడతానా? అప్పుడు సమాజంలో ఏం జరుగుతుంది? అనే భయం జీవితమంతా మనిషిని వెంటాడుతూనే ఉంటుంది. కానీ అంతరంగం నుండి వచ్చే నైతికత మనసుకు ఎంతో శాంతిని ఇస్తుంది. ఏ పరిస్థితిలోనైనా చూసేవారు ఉన్నా లేకపోయినా తాను సరిగ్గా ఉన్నాననే దృఢమైన నమ్మకంతో మనిషి ప్రశాంతంగా ఉండగలుగుతాడు.

మన ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక పెద్ద లోపం ఉంది. మనం పాఠశాలల్లో పిల్లలకు నైతికత ఏమిటో పుస్తకాల ద్వారా నేర్పిస్తాం, కానీ అది ఎందుకో అనుభవపూర్వకంగా నేర్పించం. అబద్ధం చెప్పకూడదు అని నిబంధన విధిస్తాం, కానీ ఆ అబద్ధం వల్ల ఇతరుల నమ్మకం ఎలా పోతుందో, వారు ఎందుకు నొచ్చుకుంటారో వివరించం. ఇది కేవలం నిబంధనల పట్టీ నేర్పించడం లాంటిది అది భయం ద్వారా సమాజంలో తాత్కాలికంగా నడుచుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుంది.అందుకే మన కుటుంబాల్లో, పాఠశాలల్లో, సమాజంలో ఒక గొప్ప మార్పు రావాలి. నువ్వు పట్టుబడతావు కాబట్టి ఈ తప్పు చేయకు అనే భయపెట్టే మాటల బదులు ఇది అసలు ఎందుకు తప్పో, దీని వల్ల సమాజానికి ఎంత నష్టం జరుగుతుందో పిల్లలకు చిన్నతనం నుండే అర్థం చేయించాలి. ఇది చాలా నెమ్మదిగా జరిగే మార్పు కావచ్చు, కానీ భవిష్యత్తు తరాల స్థాయిలో ఇది ఒక విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలుకుతుంది.

చివరగా భయంతో మంచివాడిగా నటించడం లేదా ఉండటం పూర్తిగా నిష్ప్రయోజనం అని చెప్పలేం. సమాజానికి అది ఒక కనీస ప్రాథమిక రక్షణను ఇస్తుంది. కానీ అది నైతికత యొక్క పరిణతి చెందిన సంపూర్ణ రూపం మాత్రం కాదు అది కేవలం నైతికత యొక్క ప్రారంభ కింది స్థాయి మాత్రమే. నిజమైన నైతికత, నిజమైన మానవ ధర్మం ప్రపంచంలో ఎవరూ మనల్ని చూడకపోయినా, శిక్ష పడే అవకాశం లేకపోయినా, ఎలాంటి స్వార్థ ప్రయోజనం కలగకపోయినా ఇది సరైనది కాబట్టి చేయడం అనే దృఢమైన నిర్ణయంలోనే ఉంది. ఆ నిర్ణయం ఎప్పుడూ మనిషి హృదయం నుండి రావాలి, హడలు నుండి కాదు.

# వివాదంలో ఆర్ ఎస్ ప్రవీణ్...

కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద.. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు.. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యంగా గురుకులాల విషయంలో ప్రవీణ్ తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వేలకోట్ల కుంభకోణం జరిగిందని.. ఇదంతా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర అని ప్రవీణ్ కుమార్ మండిపడుతున్నారు. రోజుల వ్యవధిలోనే అనేకసార్లు విలేకరుల సమావేశం నిర్వహించి.. ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా భారతీయ జనతా పార్టీ నుంచి కౌంటర్ వచ్చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకుడు గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు.. గురుకులాల నిర్వహణ.. నిధుల ఖర్చు ఇటువంటి వాటిపై గువ్వల బాలరాజు కీలకమైన ఆధారాలు బయటపెట్టారు. 2013 నుంచి 2021 మధ్యకాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు భారీగా అక్రమాలు జరిగాయని.. దాదాపు పదివేల కోట్ల వరకు ప్రజదనం పక్కదారి పట్టిందని గువ్వల బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు తాను ముఖ్యమంత్రికి ఒక లెటర్ రాశారు. టెండర్ ప్రక్రియలు మొత్తం పక్కన పెట్టి.. నిధులను సంతానికి మళ్ళించుకున్నారని బాలరాజు ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ సాగించాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం ప్రవీణ్ కుమార్ ను మాత్రమే కాకుండా.. నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును కూడా బాలరాజు న్యాయపరంగా లక్ష్యంగా చేసుకున్నారు. నాడు జరిగిన అక్రమాలకు కేసీఆర్ మద్దతు ఉందని.. ఆయన సపోర్టుతోనే ఇవన్నీ జరిగాయని బాలరాజు ఆరోపించారు. ఐపీఎస్ కేడర్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన గురుకుల సెక్రటరీ విధులను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కు ఏకంగా 10 సంవత్సరాల పాటు అప్పగించడం వెనక ఉన్న నిజాలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా ప్రవీణ్ సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మరోవైపు బాలరాజు ముఖ్యమంత్రికి రాసిన లేఖ.. చేసిన విమర్శలపై ప్రవీణ్ కుమార్ కూడా ఆదే స్థాయిలో స్పందించారు. ఇదంతా అబద్ధమని అన్నారు. కేవలం ఎనిమిది వందల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న గురుకులాలలో వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రవీణ్ ప్రశ్నించారు.. బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయాలని బాలరాజుకు చూపించారు. బాలరాజు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి.. బండి సంజయ్.. బాలరాజు తను లక్ష్యంగా చేస్తున్నారని.. ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు .



# సైబర్ బాధితుల్లో బాలీవుడ్ నటి..

సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు క్యాంపెయిన్‌ను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే పోలీసులు, అధికార యంత్రాంగం ఎంత అవగాహన కల్పించినా సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పడటం లేదు. సామాన్యులు, అధికారులు, సెలబ్రిటీలు సైబర్ బాధితుల జాబితాలో చేరిపోతూనే ఉన్నారు. తాజాగా బాలీవుడ్ నటి కీర్తి కుల్హరి సైబర్ మోసానికి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు నటి కీర్తి కుల్హరి మొబైల్‌ఫోన్, క్రెడిట్ కార్డ్‌ను హ్యాక్ చేసి రూ.2.4 లక్షలు దోచుకున్నారు. తన ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా కావడంతో అప్రమత్తమైన కీర్తి ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ స్కాం వెనుకున్న వ్యక్తులెవరో గుర్తించి డబ్బును రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సైబర్ క్రిమినల్స్ ఇండియాలో ఎలా రెచ్చిపోతున్నారో..? తాజా ఘటన మరోసారి చెప్పకనే చెబుతోంది. పింక్, మిషన్ మంగళ్, యురి ది సర్జికల్ స్ట్రైక్స్, ఇందూ సర్కార్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది కీర్తి కుల్హరి.



# 'దేశముదురు' కథ పూరి మొదట నాకే చెప్పారు : నటుడు సుమంత్



'న్యూటన్స్ థర్డ్ లా' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో టాలీవుడ్ నటుడు సుమంత్ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వచ్చి బ్లాక్‌బస్టర్ అయిన 'దేశముదురు' కథను మొదట పూరి గారు తనకే చెప్పారని, కానీ కొన్ని కారణాల వల్ల తాను ఆ సినిమాకు నో చెప్పానని ఆయన వెల్లడించారు. అయితే, ఆ సినిమాను అల్లు అర్జున్ చేసిన విధానం చూశాక.. నిజాయితీగా చెప్పాలంటే ఆ పాత్రను బన్నీ తప్ప మరొకరు అంత బాగా చేయలేరని సుమంత్ ప్రశంసించారు. ప్రస్తుతం సుమంత్, జగపతి బాబు, అవసరాల శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా' రాజేష్ కర్ణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రేపు (జూలై 31) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర ప్రమోషనల్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ చిత్రంలో రవి వర్మ, అభినయన తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాజేష్ కర్ణ రచన, దర్శకత్వం వహించగా.. హరీష్ కొహిర్కర్ నిర్మించారు. సింజిత్ ఎర్రమిల్లి సంగీతం అందించగా, వేద వ్యాస్ గొట్టిపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ఏ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్‌గా వస్తున్న ఈ చిత్రం 'థ్రిల్లర్ ఆఫ్ ది ఇయర్'గా నిలుస్తుందనే అంచనాలతో జూలై 31న థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది.

# రజనీకాంత్ బయోపిక్ రానుందా?




హీరో రజనీకాంత్ జీవితం వెండితెరపైకి వచ్చే అవకాశం ఉందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. కొంత కాలంగా రజనీకాంత్ తన ఆటోబయోగ్రఫీ రాస్తున్నారట. ఇందులో బస్ కండక్టర్ నుంచి వెండితెరపై సూపర్ స్టార్‌గా ఎదిగిన తన జీవిత విశేషాలు, తన జర్నీలోని ఒడిదొడుకులు, మధుర జ్ఞాపకాలు, భావోద్వేగభరిత పరిస్థితులను గురించి ప్రస్తావించనున్నారట రజనీకాంత్. అంతేకాదు...తన జీవితంలో ఎవరికీ తెలియని కొన్ని ఆసక్తికరమైన సంగతులను ఈ పుస్తకం ద్వారా తెలియజేయాలని రజనీకాంత్ భావిస్తున్నారట. ఈ పుస్తకం ఆధారంగా ఓ సినిమా తీయాలని, ఈ బయోపిక్‌ను తెరకెక్కించాల్సి వస్తే ఎవరు దర్శకత్వం వహించాలి? వెండితెరపై తన పాత్రలో ఎవరు నటించాలి? అన్న అంశాలపై కూడా రజనీకాంత్ తన సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారని కోలీవుడ్ భోగట్టా. మరి... రజనీకాంత్ బయోపిక్ వెండితెరపైకి వస్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ప్రస్తుతం దర్శకుడు అశ్వత్ మారిముత్తుతో 'ధర్మన్' సినిమా చేస్తున్నారు రజనీకాంత్. ఈ చిత్రం తర్వాత నెల్సన్ దర్శకత్వం వహించనున్న మల్టీస్టారర్ మూవీ షూట్‌లో పాల్గొంటారు. ఈ చిత్రంలో కమల్‌హాసన్ కూడా నటిస్తున్నారు. అలాగే నెల్సన్ డైరెక్షన్‌లో రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్ 2' చిత్రం అక్టోబరు 15న విడుదల కానున్న సంగతి తెలిసిందే.



# 4వ తరగతి వరకు బర్త్‌డే తెలియదు ..

## ధనుష్ మాటలపై నెటిజన్ల విమర్శలు!

**కో**లీవుడ్ స్టార్ హీరో, పాన్ ఇండియా నటుడు ధనుష్ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. ఇటీవల తన 43వ పుట్టినరోజు సందర్భంగా చెన్నైలో అభిమానులు నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ధనుష్, తన చిన్ననాటి జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన నిజాయితీని మెచ్చుకుంటుండగా, మరికొందరు మాత్రం ఇదే తరహా భావోద్వేగ కథలను పదేపదే చెబుతున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. పుట్టినరోజు వేడుకల్లో మాట్లాడిన ధనుష్.. జూలై 28 అనేది తనకు ఇప్పుడు ప్రత్యేకమైన రోజు అయినప్పటికీ, చిన్నప్పుడు మాత్రం తన పుట్టినరోజు ఎప్పుడో కూడా తెలియదని చెప్పారు. నాలుగో తరగతి వరకు తన జన్మదినం గురించి తనకు అవగాహన లేదని, ఒకసారి స్కూల్‌లో ఇతర విద్యార్థులు రంగురంగుల దుస్తులు వేసుకుని చాక్లెట్లు పంచుతుండటం చూసి తానూ అలానే చేయాలనిపించిందని వివరించారు. అప్పుడు తన అక్కను అడగగా, ఆమె తల్లిదండ్రులను అడిగి జూలై 28 తన పుట్టినరోజు అని చెప్పిందని తెలిపారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఒక కలర్ డ్రెస్, కొన్ని చాక్లెట్లు కొనిపించమని ఇంట్లో ఒప్పించి స్కూల్‌కు తీసుకెళ్లి పంచానని ధనుష్ చెప్పుకొచ్చారు.



# 'రామాయణం' ట్రైలర్ విడుదల..

## హనుమంతుడు ఎక్కడంటూ నెటిజన్ల ప్రశ్న!

బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో భారీ చర్చ జరుగుతోంది. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ లంకాధీశుడు రావణాసురుడిగా నటిస్తున్నారు. దాదాపు నాలుగు నిమిషాలకు పైగా ఉన్న ఈ ట్రైలర్ విజువల్స్, గ్రాఫిక్స్ పరంగా అద్భుతంగా ఉందంటూ ప్రశంసలు అందుకుంటున్నప్పటికీ, ఒక ప్రధానమైన విషయంపై నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు సన్నీ డియోల్ హనుమంతుని పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే, విడుదలైన ట్రైలర్‌లో శ్రీరాముడి బాల్యం, సీతారాముల కల్యాణం, వనవాసం, రావణుడి ఆధిపత్యం వంటి అనేక సన్నివేశాలను చూపించినప్పటికీ, హనుమంతుడికి సంబంధించిన ఒక్క చిన్న గ్లింప్స్ కూడా ట్రైలర్‌లో కనిపించలేదు. దీంతో అభిమానులు నిరాశ వ్యక్తం చేస్తూ ట్రైలర్‌లో హనుమంతుడు ఎక్కడ? అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మొదటి భాగంలో కథ ఎక్కువగా సీతారాముల వివాహం, వనవాసం, సీతాపహరణం చుట్టూ తిరుగుతుందని, అందుకే హనుమంతుడి పాత్రకు సంబంధించిన హైలైట్స్‌ను మేకర్స్ గోప్యంగా ఉంచారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అభిమానులు మాత్రం హనుమంతుడి పోస్టర్‌ను అయిన వదలండి అంటూ కామెంట్లు పెడుతున్నారు.



EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/